క్లుప్తంగా

బాల్యవివాహాలు చేయొద్దు

తానూరు: బాల్యవివాహాలు చేయకుండా ఆడపిల్లకు ఉన్నత చదువులు చెప్పించాలని తహసీల్దార్ వెంకటరమణ సూచించారు. గురువారం మండలంలోని వడ్ఝురి(బి)లో బాల్యవివాహం చేస్తున్నారనే సమాచారం మేరకు అధికారులు గ్రామానికి వెళ్లి కుటుంబసభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. బాల్య వివాహాలతో జరిగే నష్టాలను వివరించారు. వయసు రాకుండా పెళ్లి చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత, ఆర్ఐ గంగాధర్, హెడ్‌కానిస్టేబుల్ శివరాం ఉన్నారు.

'సభలకు అనుమతి తప్పనిసరి'

భైంసాటౌన్: భైంసా పట్టణంలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని సీఐ ఎల్.శ్రీను అన్నారు. అనుమతి లేకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని.. శాంతిభద్రతల పరిరక్షణకు పట్టణ ప్రజలు పోలీసులకు సహకరించాలని సీఐ కోరారు.

నేడు శనగ కొనుగోళ్లు ప్రారంభం

కుభీర్: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం శనగల కొనుగోళ్లు ప్రారంభం అవుతాయని పీఏసీఎస్ చైర్మన్ గంగాచరణ్, సీవో క్రాంతికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.5335గా ఉంద ని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జీపీ కార్మికుల పాదయాత్ర


పాదయాత్ర చేస్తున్న పంచాయతీ కార్మికులు

దస్తురాబాద్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండలంలోని బుట్టపూర్ గ్రామం నుంచి దస్తురాబాద్ వరకు పంచాయతీ కార్మికులు పాదయాత్ర చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడారు. జీవోనంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచి మల్టీపర్పస్ వర్కర్ల విధానం రద్దు చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాధ, నర్సయ్య, యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, శ్రీనివాస్, రామన్న, అంజన్న, రవి, అనిత, నర్సయ్య, విజయ్ పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన

ముధోల్: ఉపాధి నర్సరీల్లో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సురేశ్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని రాంటెక్, మచ్కల్ గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశామన్నారు. ఎండల నేపథ్యంలో నర్సరీలో సంచుల్లో నా టిన విత్తనాలు మొలకెత్తడానికి సమస్య తలెత్తుందన్నారు. ఇప్పటికే షెడ్‌నెట్ కొనుగోలు చే యాలని కార్యదర్శులకు సూచించామన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ

సారంగాపూర్: బీఆర్ఎస్ నాయకులు కూచాడి శ్రీహరిరావు జన్మదినం సందర్భంగా మండలంలోని ఇప్పచెలిమ, పెండల్‌దరి, లింగాపూర్, లక్ష్మీనగర్, ఆదివాసీగూడ గ్రామాల్లోని పేదలకు ఆ పార్టీ నాయకులు గురువారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆయా గ్రామాల ప్రజలకు అన్నదానం చేశారు. అబ్దుల్ హాదీ, మారుతి తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు

తానూరు: మండలంలోని బెల్‌తరోడా విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం నూతన ట్రాన్స్‌ఫార్మర్ బిగించినట్లు ఎస్ఈ జైవంత్‌రావ్ చవాన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ బెల్‌తరోడా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సమస్య తలెత్తకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అధికారులు దశరథ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

చెక్కులు పంపిణీ

కుంటాల: మండలంలోని అందకూర్ గ్రామంలో పలువురు లబ్ధిదారులకు గురువారం కల్యాణలక్ష్మీ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి కిషన్, ఎంపీటీసీ మధుకర్, కార్యదర్శి రమ్య తదితరులు ఉన్నారు.

బొడ్డోనికుంట పరిశీలన


చెరువు పరిశీలిస్తున్న అధికారులు, సభ్యులు

ఖానాపూర్: మండలంలోని బొడ్డోనికుంటలో చేపలు మృత్యువాత పడుతున్న విషయం తెలిసిందే.. గురువారం మత్స్యశాఖ అధికారులు కుంటను పరిశీలించారు. కుంటలో మురుగునీరు ఎక్కువగా ఉండడంతో ఆక్సిజన్ స్థాయిలు తగ్గి చేపలు మృత్యువాత పడుతాయని ఎఫ్‌డీవో సుమలత, ఎఫ్‌వో రాజేందర్ తెలిపారు. చెరువులో కొత్తనీరు నింపితే చేపలు చనిపోకుండా ఉంటాయన్నారు. గంగపుత్రుల సంఘం అధ్యక్షుడు పర్మి సురేశ్, మత్స్యకారులు నరేశ్, పరిమి రమేశ్, గడ్డి సురేశ్, గంగనర్సయ్య, లాలు, గణేశ్ ఉన్నారు.

'కదిలి' పాపహరీశ్వరుడు

- పాపహరేశ్వర స్వామి దర్శనం... సర్వపాపహరణం
- ఈశ్వరుడి నామస్మరణతో మార్మోగనున్న శివాలయాలు


ఆలయంలో స్వామివారు


శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వర ఆలయం వద్ద భక్తులు

దిలావర్‌పూర్: సహ్యాద్రి పర్వత శ్రేణుల్లోని 'కదిలి' లోయలో కొలువుదీరిన శ్రీ మాతాన్నపూర్ణ సహిత పాపహరేశ్వరాలయం దర్శించుకుంటే సర్వపాపాలు హరించబడతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. దిలావర్‌పూర్ మండలం మాడేగాం పంచాయతీ పరిధిలోని కదిలి గ్రామ అటవీప్రాంతంలో వెలసిందే శ్రీమతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయం. సహ్యాద్రి కొండల్లో మాతృహత్యాపాపం నుంచి విముక్తి పొందేందుకు పరుశురాముడు ఇక్కడ స్వయంగా శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజించాడని ఆలయ చరిత్ర చెబుతోంది. ప్రకృతి అందాల నడుమ వెలసిన పాపహరేశ్వర స్వామి చెంతనే శ్రీమతన్నపూర్ణాదేవి వెలిసింది.

కదులుతున్నట్లు కన్పించే శివలింగం..

భక్తితో పరిశీలిస్తే శివలింగం కదులుతున్నట్లు కనిపిస్తుంది. స్వామివారి ముందున్న నందీశ్వరుని చెవిలో తమ కోరికలు చెప్పుకుంటే తీరుతాయనే భక్తుల నమ్మకం. ప్రాంగణంలో ఒకే కాండంలో 18 వృక్షాలు మిళితమైన వటవృక్షం అత్తకోడళ్ల గుండాలు, సీతమ్మ అల్లుబండ, అన్నపూర్ణమాత, ఆలయ ద్వార పాలకులు సప్తరుషుల ధ్యానమందిరం, నందీశ్వరుడు, ఆవునోటి ద్వారా కోనేరులో చేరే నీరు వంటివి భక్తులను ఆకట్టుకుంటున్నాయి. అలాగే చోళులు, కాకతీయ రాజుల కాలంలో ఏర్పాటు చేసిన అనేక విగ్రహాలు వారి కళా నైపుణ్యానికి ప్రతిరూపంగా నిలుస్తున్నాయి.

వివిధ రాష్ట్రాల భక్తులు రాక

ఈ పాపహరేశ్వరాలయానికి తెలంగాణతోపాటు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర భక్తులు వచ్చి స్వామివారి సేవలో పునీతులవుతున్నారు. సినీ, రాజకీయ ప్రముఖులు సైతం స్వామివారికి ప్రత్యేక రుద్రాభిషేకం నిర్వహిస్తుంటారు. నిర్మల్ పట్టణం నుంచి భైంసాకు వెళ్లే రహదారి గుండా 12 కిలోమీటర్లు ప్రయాణిస్తే దిలావర్‌పూర్ బస్టాండ్‌కు చేరుకోవచ్చు. ఇక్కడి నుండి ఉత్తరదిశలో ఉన్న ఆలయ స్వాగత తోరణం నుంచి మరో ఆరు కిలోమీటర్లు ప్రయాణిస్తే పాపహరేశ్వరాలయానికి చేరుకోవచ్చు. నిర్మల్ నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది.

ఏర్పాట్లు పూర్తి..

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శని, ఆదివారాల్లో జరిగే పూజా కార్యక్రమాల కోసం ఆలయ కమిటీ, దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఆలయ చైర్మన్ నార్వాడి భుజంగ్‌రావుపాటిల్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రవికిషన్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం శ్రీబ్రహ్మముహూర్తాన స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, మంత్రపుష్పం నిర్వహించి భక్తులకు దర్శనం కల్గించనున్నారు. రాత్రి 11 గంటల నుంచి మహాన్యాస పూర్వకాభిషేకం, బిల్వార్చన, స్వామివార్ల లింగోద్భవ కాలదర్శన కార్యక్రమానంతరం శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేస్తారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



పాపహరేశ్వరాలయంలో మంగళ, బుధవారాల్లో జరిగే మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఇబ్బంది కల్గకుండా తాగునీరు, వైద్యసేవలు, అన్నదాన సత్రం అందుబాటులో ఉంచుతున్నాం. స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులు ఆలయ కమిటీ, అధికారుల సూచనలు పాటించాలి.
– భుజంగ్‌రావు పాటిల్, కదిలి ఆలయ కమిటీ చైర్మన్

భక్తుల కొంగుబంగారంగా కాల్వ నరసింహస్వామి..

మండలంలోని కాల్వ పరిసర అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని సైతం భక్తులు దర్శించుకోనున్నారు. నిర్మల్ నుంచి కదిలి పాపహరేశ్వరాలయానికి వెళ్లే భక్తులు రోడ్డు మార్గంలో ఎనిమిది కిలోమీటర్లు ప్రయాణిస్తే న్యూలోలం సమీపాన నిర్మల్–భైంసా రహదారిపై స్వామివారి స్వాగతతోరణం దర్శనమిస్తుంది. ఈస్వాగత తోరణం గుండా మరో మూడు కిలోమీటర్లు ఉత్తరాన ప్రయాణిస్తే శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి ఆలయానికి చేరుకోవచ్చు. స్వామివారి చెంతనే ఉన్న అష్టముఖి కోనేరులో స్నానం చేస్తే కష్టాల నుంచి ఊరట లభిస్తుందని భక్తుల నమ్మకం.

ఏకనాథుని, రాజరాజేశ్వర ఆలయాల్లో

మహాశివరాత్రి పర్వదినం నేపథ్యంలో దిలావర్‌పూర్‌లోని ఏకనాథుని ఆలయం, అలాగే అటవీ ప్రాంతంలో శ్రీరాజరాజేశ్వరాలయాల్లో శని,ఆదివారాల్లో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నారు.

తాగునీటి సమస్య రానీయొద్దు

- ఎమ్మెల్యే రేఖానాయక్
- నాలుగోసారి సాగిన పెంబి మండల సర్వసభ్య సమావేశం
- గతంలో మూడుసార్లు కోరం లేక వాయిదా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

పెంబి: వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య రానీయకుండా భగీరథ అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కవిత అధ్యక్షతన పెంబి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గత మూడు సమావేశాలు సరైన కోరం లేక వాయిదా వేశారు. నాలుగోసారి నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈసందర్భంగా పలువురు తమ సమస్యలను లేవనెత్తారు.

నిధులు జమవడం లేదని..

తమ పంచాయతీల ఖాతాల్లో నిధులు జమవడం లేదని.. దీంతో పంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదని పలువురు సర్పంచ్‌లు పేర్కొన్నారు. పెంబి పీహెచ్‌సీలో సిబ్బంది కొరత ఉందని.. 24జీపీలకు ఐదుగురు ఆశవర్కర్లు మాత్రమే పని చేస్తున్నారని అన్నారు. రెగ్యులర్ మెడికల్ ఆఫీసర్‌ను నియమించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని సర్పంచ్‌లు విన్నవించారు.

స్పందించిన ఎమ్మెల్యే మండలానికి ఐదు సబ్‌సెంటర్లు మంజూరయ్యాయని.. ఇంకా కావాలంటే.. సదరు గ్రామపంచాయతీ తీర్మానం చేసి ఇస్తే మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లి మంజూరయ్యేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

టీఏను తొలగించాలి..

పశువుల పాకను రికార్డుల్లో నమోదు చేస్తానని మందపల్లిలోని ఓ వ్యక్తి వద్ద రూ.ఐదు వేలు తీసుకున్న మందపల్లి టీఏ అంజయ్యను విధుల నుంచి తొలగించాలని వైస్ ఎంపీపీ గంగారెడ్డి ఎమ్మెల్యేకు తెలిపారు. గ్రామాల్లో మొక్కలకు నీటిని పోస్తున్న వాటర్‌ట్యాంకును సైతం రికార్డుల్లో చూపకపోవడంతో డబ్బులు జమ కావడం లేదని హరిచంత్‌తండా సర్పంచ్ సుదర్శన్, పెంబి సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్ విన్నవించారు. టీఏ అంజయ్యను సమావేశంలోకి పిలిచి ప్రశ్నించగా కేవలం నా అవసరానికే డబ్బులు తీసుకున్నానని సమాధానమిచ్చాడు. అనంతరం ఎమ్మెల్యే డీఆర్డీవో విజయలక్ష్మికి ఫోన్ చేసి ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పెంబి మండలంలో ఎక్కువగా గిరిజనులే ఉన్నారని.. అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జానుబాయి, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, ఎంపీటీసీలు రామారావు, గోదావరి, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీవో రత్నాకర్‌రావు, పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మండలస్థాయి సైన్స్ పోటీలు


తానూరు: ఆన్‌లైన్ పరీక్షలో విద్యార్థులు

మామడ: మండల కేంద్రంలో గురువారం మండలంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షలో శివాని (మామడ), రాహుల్ (కొరిటికల్), హర్షవర్ధన్ (పొన్కల్) జిల్లా స్థాయి పోటీలకు ఎంపికై నట్లు మామడ ప్రధానోపాధ్యాయుడు నరసింహస్వామి తెలిపారు.

తానూరు: తానూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఆన్‌లైన్‌లో మండలస్థాయి సైన్స్ ప్రతిభా పోటీలు నిర్వహించారు. పదో తరగతిలో ఎస్.పల్లవి(కేజీబీవీ), తొమ్మిదో తరగతిలో ప్రథమ స్థానంలో శృతి(ఎల్వి), ద్వితీయ స్థానంలో పి.శిరిష నిలిచారు. ప్రధానోపాధ్యాయుడు సుభాశ్ మొస్లే, సైన్స్ ఉపాధ్యాయులు సుదర్శన్, మాధవ్‌రావ్, విజయ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సర్కారుబడిలోనే నాణ్యమైన విద్య


కడెం: వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే రేఖానాయక్

పెంబి: సీఎం కేసీఆర్ హయాంలో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య అందుతోందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ పేర్కొన్నారు. మన ఊరు– మన బడిలో భాగంగా గురువారం మండలంలోని మందపల్లి గ్రామంలో అదనపు తరగతి గదులు, డైనింగ్‌హాల్ నిర్మాణానికి రూ.50లక్షలు మంజూరవగా ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి ప్రారంభించారు. పుప్పాల శంకర్, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, వీడీసీ అధ్యక్షుడు మురళి, ఉపాధ్యక్షుడు నరేందర్, శంకర్, గంగన్న, శ్రీనివాస్, శంకర్ తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఖానాపూర్: మండలంలోని పాతఎల్లాపూర్ గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించే అన్నపూర్ణ మహాదేవాలయ నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే రేఖానాయక్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అంబటి స్వప్న, ఎంపీటీసీ ప్రేమలత, శంకర్, నారాయణ, శోభన్ తదితరులున్నారు.

'సేవాలాల్' సేవలు మరువలేనివి

కడెం: బంజారజాతికి సంత్ సేవాలాల్ మహారాజ్ చేసిన విలువైన సేవలు మరువలేనివని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శంకర్, ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య, జీవన్‌రెడ్డి, వేణుగోపాల్, రాజేశ్ నాయక్, మోహన్‌నాయక్, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేయిస్తున్న లక్ష్మణచాంద నాయకులు


రక్తదాన శిబిరంలో పాల్గొన్న దేవేందర్‌యాదవ్


మొక్క నాటుతున్న మంత్రి, అటవీ అధికారులు

లక్ష్మణచాంద: జిల్లాలో గురువారం మంత్రి ఐకేరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నిర్మల్‌లోని తన నివాసంలో నిర్వహించిన వేడుకల్లో మండలంలోని పలువురు నాయకులు పాల్గొన్నారు. డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా కార్యతర్శి అడ్వాల రమేశ్, జెడ్పీటీసీ రాజేశ్వర్, అల్లోల సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, కేశం రమేశ్, అట్ల సురేశ్‌రెడ్డి, ఈటెల శ్రీనివాస్, పోతుగంటి రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: ఆయురారోగ్యాలతో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఉండి ప్రజలకు మరింత సేవ చేయాలని భాగ్యలక్ష్మి మిల్క్ సెంటర్, బీఆర్ఎస్ నాయకులు దేవేందర్ యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దేవేందర్‌యాదవ్ ఏర్పాటు చేసిన బ్లడ్ డొనేషన్ క్యాంప్‌ను మంత్రి ప్రారంభించారు. అలాగే ఏటా అన్నదానం నిర్వహిస్తున్నందుకు అభినందించారు. రమేశ్‌యాదవ్, రవియాదవ్, ఆదిత్య, రామకృష్ణ, మణికంఠ, చంద్రశేఖర్, రాజు, స్వామి, గంగాధర్ పాల్గొన్నారు.

వెల్లువెత్తిన అభిమానం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా మంత్రికి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక శాస్త్రినగర్‌లో లక్కడి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం ప్రారంభించారు. క్యాంప్ కార్యాలయంలో అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. పాకాల ఫౌండేషన్ చైర్మన్ పాకాల రాంచందర్, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణచారి, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. నిర్మల్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో అల్లోల గౌతమ్ రెడ్డి ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు.

గ్రామాల్లో 'కంటివెలుగు' పరిశీలన


ఓలాలో కంటి పరీక్ష చేసుకుంటున్న ఎస్సై

లక్ష్మణచాంద:మండలంలోని చామన్‌పెల్లిలో కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ గంగాధర్ ప్రారంభించగా తహసీల్దార్ కవితారెడ్డి సందర్శించారు. 18 ఏళ్లు నిండిన వారంతా కంటి పరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు. ఉపసర్పంచ్ రమణ, వైద్యులు శ్రీకాంత్, శ్వేత, సిబ్బంది శివకృష్ణ, యాస్మిన్, రవీందర్, సుగుణ పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని ఓలా గ్రామ కంటివెలుగు శిబిరంలో ఎస్సై సాయికిరణ్ పరీక్షలు చేయించుకున్నారు. వారి వెంట సర్పంచ్ కనీష్ ఫాతిమా, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, వైద్యాధికారి దామోదర్, హైమద్ పాషా, కార్యదర్శి సుమన్, ఏఎస్సై దేవరావ్, పలువురు వార్డుసభ్యులు గంగాప్రసాద్, గణేశ్ తదితరులున్నారు.

మిషన్ భగీరథ పైపులైన్లకు మరమ్మతులు

లక్ష్మణచాంద: వేసవి సమీపిస్తున్నందున గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతామని మిషన్‌భగీరథ ఈఈ సందీప్ పేర్కొన్నారు. గురువారం సోన్ మండలం న్యూవెల్మల్‌లో చేపడుతున్న మిషన్ భగీరథ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. పైపులైన్ లీకేజీలు, మరమ్మతులు సరిచేయాలని అధికారులకు సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇబ్బందులను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని యన తెలిపారు. వారి వెంట డీఈ వినోద్, వీడీసీ నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వైఫల్యాలను వివరించాలి


లక్ష్మణచాందలో మాట్లాడుతున్న మెడిసెమ్మె రాజు

లక్ష్మణచాంద: రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు బీజేపీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు అన్నారు. గురువారం రాత్రి మండల కేంద్రంలో ప్రజాగోసా– బీజేపీభరోసా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అర్హులకు డబుల్ ఇళ్లు, 24 గంటల ఉచిత కరెంట్ వంటి హామీలు నెరవేర్చలేదన్నారు. కేంద్రప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల ఇన్‌చార్జి కమల్‌నయన్, రంజిత్, రాజు, గంగాధర్, రమేశ్, రాజేశ్వర్, శ్రీనివాస్, శంకర్, అశోక్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

తరోడాలో..

ముధోల్: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని గంగాభూషణ్ అన్నారు. మండలంలోని తరోడ గ్రామంలో శక్తి కేంద్రం సమావేశం నిర్వహించారు. బీజేపీ కార్నర్ సమావేశాలతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించామని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న, శక్తి కేంద్రం ఇన్‌చార్జి శ్రీకాంత్, సర్వేశ్, స్వామిగౌడ్, వెంకటేశ్, రాము, సూర్యకాంత్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

వాటర్‌ట్యాంకు ప్రారంభం

కుంటాల: గ్రామీణ ప్రాంతాల్లో తమ సేవలు విస్తరిస్తామని రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం సమన్వయ కర్త రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెంచికల్‌పాడ్‌లో రిలయన్స్ ఫౌండేషన్, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన వాటర్‌ట్యాంక్‌ను గురువారం సర్పంచ్ భోజాబాయి ప్రారంభించారు. పాఠశాల హెచ్ఎం ఎల్లన్న ట్విట్టర్ ద్వారా గ్రామ సమస్యలను ఎన్‌జీవోలకు తెలియజేయడం అభినందనీయం అన్నారు. ఉప సర్పంచ్ కిష్టయ్య, ఫౌండేషన్ కోఆర్డినేటర్ సుధాకర్ పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని తన నివాసంలో గురువారం ప్రజావైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం 3194 క్యాలెండర్, డైరీలను మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఉద్యోగులు మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ వరుణ్‌రెడ్డి తన కార్యాలయంలో ఆరోగ్య ఉద్యోగుల డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో ధనరాజ్, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్, వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్‌గౌడ్, కార్యదర్శి కన్నయ్య పాల్గొన్నారు.

అన్నదానం

నిర్మల్‌చైన్‌గేట్:బీఆర్ఎస్ నాయకులు కూచాడి శ్రీహరిరావు జన్మదినం పురస్కరించుకొని కొంతం గణేశ్ ఆధ్వర్యంలో శ్రీ సత్య సాయి నిత్య అన్నదాన పథకం ద్వారా ప్రభుత్వ మేటర్ నటి అండ్ చైల్డ్ హెల్త్ హాస్పిటల్‌లో గురువారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో పి.అరవింద్, నర్సారెడ్డి, సంగీత్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

ముధోల్: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించే శనగ కొనుగోలు కార్యక్రమానికి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి హాజరవుతారని పీఏసీఎస్ చైర్మన్ తీగల వెంకటేశ్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సకాలంలో హాజరవాలని కోరారు.

డీటీగా తెలంగ్‌రావ్

దస్తురాబాద్: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా తెలంగ్‌రావ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలో భూపరిపాలన వి భాగంలో విధులు నిర్వహించి బదిలీపై దస్తురాబాద్ వచ్చారు. ఇక్కడ డీటీగా పని చేసిన సత్యనారాయణ బదిలీపై భూపరిపాలన విభాగానికి వెళ్లారు.

ఆలయ వార్షికోత్సవం

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(కె) గ్రామంలో గురువారం పెద్దమ్మతల్లి ఆలయ మూడో వార్షికోత్సవం నిర్వహించారు. వివిధ గ్రామాల ప్రజలు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

సాయిబాబా ఆలయంలో భక్తుల పూజలు

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల మహిళలు పాదయాత్రగా ఆలయానికి చేరుకున్నారు. బాబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

నాగుపాము కలకలం

నిర్మల్‌టౌన్: పట్టణంలోని సోఫీనగర్ కాలనీలో ఓ ఇంట్లో నాగుపాము కలకలం రేపింది. సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం పక్కనున్న ఓ ఇంట్లోకి పాము చొరబడింది. గమనించిన కుటుంబీకులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురై బయటకు పరుగులు తీశారు. వెంటనే పాములు పట్టే సామాజిక కార్యకర్త ఫిరోజ్‌ఖాన్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి పామును ఒక డబ్బాలో బంధించాడు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

కడెం: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని డీఈవో రవీందర్‌రెడ్డి, టీజీవో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అజ్మీరా శ్యాంనాయక్ అన్నారు. గురువారం మండలంలోని అంబారిపేట్ జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం వార్షికోత్సవం నిర్వహించగా వారు పాల్గొని మాట్లాడారు. ఎంపీపీ అలెగ్జాండర్, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీ, ఎంపీటీసీ సింధూజ, హెచ్ఎం ప్రేందాస్, నాగేష్, సాగర్ ఉన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

ఖానాపూర్: మహాశివరాత్రి నేపథ్యంలో పట్టణంలోని గోదావరికి వచ్చే భక్తులు అసౌకర్యానికి గురి కాకుండా ఏర్పాట్లు చేయాలని హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు రాచమల్ల రాజశేఖర్ అన్నారు. ఈ మేరకు హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గోదావరి వద్ద పుణ్యస్నానానికి వచ్చే మహిళలకు బట్టలు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు, చిన్నారులకు జల్లు స్నానం ఏర్పాటు చేయాలని ఆయన పేర్కొన్నారు. విద్యుత్, నీటి సౌకర్యం కల్పించి వైద్య బృందాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. సమితి అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

ఎస్సైకి సన్మానం

కుంటాల: కుంటాల ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన సాయికిరణ్‌ను గురువారం ఓలా గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఇందులో సర్పంచ్ కనీష్ ఫాతిమా, ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, హైమద్ పాషా పాల్గొన్నారు.